నేటి నుంచి యథావిధిగా రిజిస్ట్రేషన్ల సేవలు

చిక్కడపల్లి: ఇంటర్‌నెట్ వైర్లు కట్ కావడంతో చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ల సేవలు నిలిచిపోయాయి. దీంతో సోమ, మంగళవారాల్లో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం సిబ్బంది బీఎస్ఎన్ఎల్ డీజీఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం కనెక్షన్‌ను పునరుద్ధరించారు. బుధవారం నుంచి యథావిధిగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

చిక్కడపల్లి: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వివేక్ నగర్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ జానకీ సుధాకర్, ఈఓ దేవనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఓ రూపంలో అలంకరించి పూజలు చేస్తామన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రాజేంద్రనగర్‌లో ప్యాచ్‌వర్క్



కాచిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారి స్థానికులతో పాటు వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని కార్పొరేటర్ ఉమారాణి జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. మంగళవారం రాజేంద్రనగర్‌కాలనీలో ప్యాచ్‌వర్క్ పనులను కార్పొరేటర్ చేయించారు. ఈ కార్యక్రమాలు నేతలు, బి.భీమ్‌రాజ్, సంతోష్, శ్రీనివాస్, రాహుల్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఓఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావుకు సన్మానం




చిక్కడపల్లి: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఏలూరి శ్రీనివాసరావును తెలంగాణ కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్మికశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు బి.జాసన్ ఈ సందర్భంగా శ్రీనివాసరావును సన్మానించి మాట్లాడారు. రాష్ట్ర ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం గుర్తింపు తీసుకురావడంతో పాటు తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ కౌన్సిల్ పునరుద్ధరణ విషయంలో శ్రీనివాసరావు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.సత్యనారాయణ, శ్రీరామ్‌రెడ్డి, సంఘం సభ్యులు శ్యామ్‌సుందర్ జాజు, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, కమిటీ సభ్యుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం రెండు దఫాల్లో విడుదల చేస్తామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్వీ శ్రీకాంత్, పొడపంగి నాగరాజు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం మాటల వరకే పరిమితం కాకుండా బకాయిలను అన్నింటిని త్వరితగతిన తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ఫీజు రీయింబర్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు.

యూపీహెచ్‌సీల్లో 14 రకాల వైద్య సేవలు

నేటి నుంచి 24 వరకు ప్రత్యేక శిబిరాలు



ముషీరాబాద్: ఆరోగ్య మహిళా, శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని 6 యూపీహెచ్‌సీలో 14 రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని అంబర్‌పేట క్లస్టర్ ఎస్‌పీహెచ్‌వో డా. పద్మజ తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో అంబర్‌పేట క్లస్టర్ పరిధిలోని యూపీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పద్మజ మాట్లాడుతూ... నేటి నుంచి ఈనెల 24వ తేదీ వరకు యూపీహెచ్‌సీలలో ప్రత్యేక వైద్య శిబిరాలలో గైనకాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, జనరల్ ఫిజిషియన్, డెంటల్, ఆర్థోపెడిక్, రేడియాట్రిక్, ఈఎన్‌టీ, జనరల్ హెల్త్‌క్యాంపు, కంటి తదితర వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆయా విభాగాల సంబంధించిన ప్రముఖ వైద్యులు పరీక్షలు చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తామన్నారు.

సర్వీస్ రోడ్ లేని దృశ్యం



సర్వీస్ రోడ్ పునరుద్ధరణ ఇంకెన్నాళ్లు..?

అంబర్‌పేట: అంబర్‌పేటలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను ప్రారంభించి నెలలు గడిచిన సర్వీస్ రోడ్ పునరుద్ధరణ జరగడం లేదు. ఛే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక వైపు వెళ్లే ఫ్లైఓవర్ కింద రోడ్డు వివాదాల్లో చిక్కుకుని ముసుకుపోయింది. రెండు మూడేళ్లుగా ఓ జాతీయ రహదారిని మూసీ వేసినప్పటికీ ప్రభుత్వం కళ్లు మూసుకుని ఉండడం గమనార్హం. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే సర్వీస్ రోడ్ ఎందుకు బంద్ అయ్యిందన్న విషయాన్ని విస్మరించి పరిష్కరించకపోవడం దారుణం.

☛ అంబర్‌పేటతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ప్రధాన రోడ్డుపై అడ్డుగోడ కట్టిన విషయాన్ని గమనించి విస్మయానికి గురవుతున్నారు. ఇక్కడ ప్రభుత్వం ఉందా లేకా ప్రత్యేక పాలన నడుస్తుందా? అని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. బహిరంగంగా సర్వీస్ రోడ్ మూసివేసినప్పటికీ పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సుమారు రూ.400 కోట్లతో అంబర్‌పేట నిర్మించిన ఫ్లైఓవర్‌కు నేటికి పూర్తి స్థాయిలో సర్వీస్ రోడ్ లేకపోవడం గమనార్హం.

నిత్యం అవస్థలు...

ఛే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక వైపు వెళ్లే వారికి సర్వీస్ రోడ్ లేకుండా పోయింది. ఇక్కడ ఉన్న సర్వీస్ రోడ్‌పై వివాదం నెలకొనడంతో మూతపడింది. నిత్యం వందలాది మంది రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయి.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు వెళ్లడానికి ఇబ్బందులు

గోల్నాక తులసినగర్‌లో ఉన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ క్యాంపు ఆఫీసుకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సర్వీసు మూతపడటం ఎమ్మెల్యేకు సైతం తలనొప్పిగా మారింది. సామాన్యులు క్యాంపు ఆఫీసుకు వెళ్లడానికి చుట్టు గల్లీల్లో తిరిగి అతికష్టం మీద చేరుకుని ఏదైన సమస్య ఉంటే చెప్పుకోవాల్సి వస్తుంది. ఎమ్మెల్యే సైతం సమస్యపై దృష్టి సారించినా కొలిక్కి రాకపోవడం గమనార్హం.

ఛే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక వైపు సర్వీస్ రోడ్ మూసివేతతో ఇబ్బందులు

- ప్రతిష్టాత్మక నిర్మించిన ఫ్లైఓవర్‌కు 'నో సర్వీస్ రోడ్'
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి దారి లేని వైనం
- కొందరి స్వార్థంతో కొలిక్కి రాని వివాదం
- సీఎం రానున్న నేపథ్యంలో సమస్య పరిష్కారం అయ్యేనా?
- సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు సమాలోచనలు చేస్తున్న బాధితులు



గోల్నాక సర్వీస్ రోడ్‌పై నిర్మించిన గోడ

గోల్నాక చౌరస్తా, ఛే నంబరు, తిలకనగర్, తులసినగర్ తదితర ప్రాంతాలకు వెళ్లడానికి దారిలేకుండా పోయింది. ఈ ప్రాంతాలకు చేరుకోవడానికి రాంగ్ రూట్లు, అడ్డదారులు వెతుక్కోవాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇక్కడి సర్వీస్ రోడ్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అధిపత్యం కోసం సర్వీస్ రోడ్ బంద్..

సర్వీస్ రోడ్ సమీపంలో ఓ వ్యక్తి శ్మశానం ఉందని ఓ కుటుంబం పేర్కొంటోంది. దాని పక్కనే ఓ మసీదు ఉంది. వీటిపై రెండు కుటుంబాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఒక అంశంపై పోలీసు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ప్రజాప్రతినిధులు ఇంత మంది దృష్టి సారించినా సమస్యను కొలిక్కి రాకపోవడం విచారకరం. ఇద్దరు వ్యక్తుల మధ్య ఆధిపత్యం కోసం వివాదాన్ని ముగించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా ప్రయోజనాల అంతిమమని గతంలో సుప్రీం కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ ఇక్కడ వర్తించనున్నట్లు వ్యవహరించడం శోచనీయం.


సీఎం రాకతో ఏమైనా పరిష్కారం దొరికేనా..?

ఈనెల 25న బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి సీఎం రాక దాదాపు ఖరారు అయ్యింది. గతంలో పూలే జయంతి, అంబేడ్కర్ జయంతుల సందర్భంగా సీఎం వస్తున్నట్లు తెలియడంతో పరిసర ప్రాంతాల రోడ్లు వెంటనే మెరుగుపడ్డాయి. ఇక్కడ ఎమ్మెల్యే బీఆర్ఎస్, ఎంపీ బీజేపీ ఉండడంతో ప్రభుత్వం కాంగ్రెస్ కావడంతో ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముఖ్యమంత్రి రాకతోనైనా అంబర్‌పేటతో పాటు జాతీయ రహదారిపై నెలకొన్న సమస్య పరిష్కారానికి నోచుకుంటుందని పలువురు ఆశిస్తున్నారు.

రాజ్యాధికారంతోనే 'పీడీఏ' వర్గాల అభివృద్ధి సాధ్యం

కాచిగూడ: పీడీఏ (పిచ్డా, దళిత్, అల్పసంఖ్యక్) వర్గాలకు రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను మంగళవారం ఆయన కాచిగూడలో మీడియాకు తెలియజేశారు. పీడీఏ భాగస్వామిక శక్తులైన అభ్యుదయ వాదులు, స్త్రీలు, దళితులు, వెనుకబడిన తరగతులు, విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి అక్టోబర్‌లో రాష్ట్రంలో 'పీడీఏ యాత్ర'ను చేపట్టనున్నట్లు తెలిపారు. పీడీఏ యాత్ర ప్రజలను చైతన్య పరిచి మరో సామాజిక తెలంగాణ సాధనకై సిద్ధం కావాలని పిలుపునిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీహరి ముదిరాజ్, మహ్మద్ మిర్జా బేగ్, మహ్మద్ ముజాహిద్, విజయ్‌కుమార్, మహ్మద్ రిజ్వాన్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



చిక్కడపల్లి: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విశ్వవిద్యాలయమని ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానంద రావు అన్నారు. దీనికి సింగపూర్, మలేషియా వంటి దేశాలలో శాఖలు ఉన్నాయని తెలిపారు. వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉగాండ నివాసి బూరుగుపల్లి వ్యాసకృష్ణ, రాధ దంపతులకు మంగళవారం ఆత్మీయ సత్కారం చేశారు.

కేంద్ర గ్రంథాలయం వద్ద భారీ బందోబస్తు

- కవిత వస్తుందన్న సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు
- జాగృతి కార్యకర్తలు రాకపోయినా మధ్యాహ్నం వరకు బందోబస్తు



చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం వద్ద బందోబస్తులో మహిళా పోలీసులు

చిక్కడపల్లి: నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ విద్యార్థులను కలసి వారి సమస్యలను తెలుసుకోవడానికి జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వస్తుందన్న సమాచారంతో చిక్కడపల్లి లైబ్రరీ వద్ద మంగళవారం పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉదయం 10గంటలకు కవిత వస్తుందన్న సమాచారంతో పోలీసులు ఉదయం 8.30 గంట నుంచి లైబ్రరీ వద్ద మోహరించారు. లైబ్రరీ ఆవరణలో కుడివైపు ఓపెన్ ప్లేస్‌లో రెండు వ్యాన్‌లు, బయట రెండు వ్యాన్‌లలో వంద మంది పోలీసులు చేరుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ పర్యవేక్షణలో లైబ్రరీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూశారు.

కవితను నిలదీసేందుకు వచ్చిన మరో వర్గం..
కల్వకుంట్ల కవిత లైబ్రరీకి వస్తే ఆమెను నిలదీయాలని మరో వర్గం నిరుద్యోగులు ఎదురు చూశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలు ఇవ్వకుండా ఇప్పుడు వచ్చి నిరుద్యోగులను పరామర్శిస్తారా.? అని ఆమెను నిలదీస్తామని అన్నారు. ఆమెను లైబ్రరీలో రానీయకుండా అడ్డుకుంటామని ఓ వర్గం నిరుద్యోగులు వేచి చూశారు. అయితే మధ్యాహ్నం ఒంటిగంట వరకు కవిత, జాగృతి కార్యకర్తలు ఎవరూ రాలేదు. అయితే పోలీసులు మాత్రం మధ్యాహ్నం వరకు బందోబస్తును కొనసాగించారు.

ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ప్రొ. శాంతాసిన్హా



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చే ఏడాది జనవరి 25 నుంచి 28 వరకు జరిగే ఐద్వా 14వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ప్రొ. శాంతాసిన్హా పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా తెలంగాణరాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన ఐద్వా 14వ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాంతాసిన్హా మాట్లాడుతూ.. మహిళా హక్కుల సాధనకు ఐద్వా అనేక పోరాటాలు చేస్తోందని అన్నారు. 33 శాతం రిజర్వేషన్ల సాధనకై ఎంతగానో కృషి చేసిందని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం యోధురాలు మల్లు స్వరాజ్యం, వీరనారి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని ఉద్యమించాలని సూచించారు.

☛ ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ మాట్లాడుతూ... ప్రభుత్వ విద్య, వైద్యం ఐద్వా పోరాటాల ఫలితంగానే సాధించుకున్నామని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, లైంగిక వేధింపులు అత్యాచారాలను నిరోధించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆహ్వాన సంఘం చైర్మన్‌గా ప్రొఫెసర్ శాంత సిన్హా, గౌరవ అధ్యక్షులుగా జూలకంటి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లు లక్ష్మీ , కోశాధికారిగా ఆర్. అరుణజ్యోతితో పాటు 85 మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు సుధ సుందర రామన్, జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, పాలడగు భాస్కర్, సైకిలాబ్ బాబు, టి.జ్యోతి, కేఎన్ ఆశలత మాచర్ల భారతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమా.. మా స్థానికత ఎక్కడ?

- విద్యార్థులకు ఇబ్బందిగా మారిన లోకల్, నాన్-లోకల్ సమస్య
- తీవ్రంగా నష్టపోతున్న నీట్ యూజీ-25 క్వాలిఫైడ్ విద్యార్థులు
- కౌన్సిలింగ్‌లో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్



ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కవాడిగూడ: నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు శాపంగా మారిన జీఓ నం. 33ను వెంటనే రద్దు చేయాలని.. జీఓ వల్ల నష్టపోతున్న నీట్ యూజీ 2025 తెలంగాణ క్వాలిఫైడ్ విద్యార్థులకు న్యాయం చేయడానికి తక్షణమే కౌన్సిలింగ్‌లో ప్రభుత్వం జోక్యం చేసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరారు. జీఓకు ముందు అర్హత ఉన్నా సరే లోకల్ కాదని తిరస్కరించడం దారుణమన్నారు. విద్యార్థులకు ఇబ్బందిగా మారిన లోకల్, నాన్‌లోకల్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వమా.. మా స్థానికత ఎక్కడ? మా భవిష్యత్ ఏమిటి? మాకు న్యాయం చేయండి.. అంటూ నీట్ విద్యార్థులు నినాదాలు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ... వాస్తవానికి తెలంగాణ ప్రభుత్వం 2024 జూలై 19న జీఓ 33ని విడుదల చేసిందన్నారు. జీఓలో పేర్కొన్న వివరాల ప్రకారం విద్యార్థులు 9, 10, 11, 12 తరగతులు వరుసగా ఎక్కడ చదివితే అక్కడ స్థానికత లభిస్తుందని వారు పేర్కొన్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్రభుత్వం జీఓ.33ను 2024 జూలై 19న విడుదల చేసిందన్నారు. అదే సంవత్సరం అంటే 2024 మార్చి నాటికి విద్యార్థులు ఇంటర్ విద్యను పూర్తి చేశారని వారు పేర్కొన్నారు. కాబట్టి నూటికి నూరు శాతం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీఓ విద్యార్థులకు వర్తించదని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని నీట్ కౌన్సిలింగ్ విషయంలో లోకల్, నాన్ లోకల్ సమస్యలపై తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రాసిన మొత్తం 45 మంది విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేయకుండా కాపాడాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సిందే..

సీఎంకు లేఖ రాసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.8వేల కోట్లు చెల్లించే వరకు ఉద్యమం కొనసాగుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మొత్తం ఫీజుల బకాయిలు రూ.8వేల కోట్లు ఉంటే కేవలం రూ.600 కోట్లు మాత్రమే చెల్లిస్తామని ప్రకటించడం సరికాదన్నారు. రూ.600 కోట్లు ఏ మూలకు సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు బకాయిల సమస్యకు మొత్తం బకాయిలు చెల్లిస్తేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలని ఆర్.కృష్ణయ్య మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బంద్‌కు పిలుపునిచ్చిన కళాశాలల యాజమాన్యలు బంద్‌ను విరమించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువుల వాతావరణాన్ని దెబ్బతినకుండా కాపాడినందుకు ఆయన కళాశాలల యాజమాన్యాలను అభినందించారు. ఫీజుల బకాయిలు చెల్లించే వరకు విద్యార్థి ఉద్యమం కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకువచ్చే సంస్కరణలు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఫీజులు కట్టకుండా అడ్మిషన్లు ఇచ్చే విధంగా ప్రభుత్వం విద్యార్థి, ప్రిన్సిపాల్‌తో జాయింట్ అకౌంట్ పెట్టాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) విద్యానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మేకల కాపరి మృతి
నిజామాబాద్ జిల్లాకు చెందిన షేక్ ఆలీబిన్ ముబారక్(24) పాతబస్తీలోని వట్టేపల్లి వద్ద ఉంటూ మేకల కాపరిగా పనిచేస్తున్నాడు. ఫలక్‌నుమా – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గానికి ఓ మోడ్రన్ ధోబీఘాట్



బీసీశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కవాడిగూడ: రజక వృత్తిదారుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని... మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తులు మారాలని... వృత్తి చేసుకునే వారికి ప్రతి నియోజకవర్గానికి ఒక అధునాతన మోడ్రన్ ధోబీఘాట్ నిర్మించడానికి యాక్షన్ ప్లాన్ చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రజకులకు హామీ ఇచ్చారు. తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ నేతలు, బస్తీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి మంగళవారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్, బీసీ కమిషనర్ బాల మాయదేవి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, బీసీ వాషర్‌మెన్ ఎండీ చంద్రశేఖర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా రజక వృత్తిదారులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం రజకాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు సమావేశ వివరాలను వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న 21 ధోబీఘాట్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని వారిని కోరినట్లు తెలిపారు. ఇందులో తొమ్మిది ధోబీఘాట్లను మోడ్రన్‌గా తీర్చిదిద్దాలని, మిగతా పన్నెండింటిలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరామన్నారు. బుద్ధపూర్ణిమ, షేక్‌పేట అశోక్ నగర్, లోయర్ ట్యాంక్‌బండ్, మీరాలం ట్యాంక్ తదితర ధోబీఘాట్ల అభివృద్ధి కనీసం రూ.15లక్షల నిధులు కేటాయించాలని మంత్రిని కోరామని తెలిపారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నియోజకర్గానికి ఒకటి చొప్పున 118 మోడర్న్ ధోబీఘాట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చాలా జిల్లాల్లో రజక వృత్తిదారులకు కేటాయించిన భూమిపై తలెత్తిన వివాదాలు పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని వారు చెప్పారు.

దినేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి



ముషీరాబాద్: పేదింటి కుటుంబానికి చెందిన దినేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని.. ఆయన ఆచూకీని వెంటనే గుర్తించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారికి మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వినోభానగర్‌లోని దినేష్ కుటుంబ సభ్యులను గండి కృష్ణమాదిగ, గజ్జల రాజశేఖర్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దశరథ్, ఎల్లయ్య, విష్ణు, జనార్దన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటితరానికి సాయుధ పోరాటాన్ని తెలియజేయాలి



కవితాగానంలో పాల్గొన్న కె.ఆనందాచారి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సాయుధ పోరాటానికి వక్రీకరణ జరుగుతున్న ఈ తరుణంలో అసలైన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత కవులు, కళాకారులపై ఉందని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ, టీపీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యాదిలో... కవితాగానం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ అంటేనే పోరాటమని అన్నారు. అణిచివేతను తరమికొట్టడానికి ఏర్పడిన పోరాటమే సాయుధ పోరాటమని పేర్కొన్నారు. ఈ పోరాటానికి మతం రంగు పులమడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో కవులు, వనపట్ల సుబ్బయ్య, సోమిడి జగన్‌రెడ్డి, మోహన్ కృష్ణ, సలీమ, ఎంవీ రమణ, బండి సత్తెన్న, శరత చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా విమోచన దినోత్సవం నిర్వహించండి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గౌతంరావు
- నేడు పరేడ్‌గ్రౌండ్‌కు కేంద్రరక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని (సెప్టెంబర్ 17) ప్రజలు వాడవాడలా నిర్వహించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ప్రజలు జాతీయ జెండాలను ఎగురవేసి తమ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. విమోచన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు.

మజ్లిస్‌కు భయపడి విమోచన దినోత్సవం నిర్వహించడం లేదు..
నిజాం, రజాకార్ల అణచివేత పాలనలో ప్రజలకు భద్రత లేదని ఆయన ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా ఎందుకు జరుపుకోవడం లేదో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓట్ల కోసం, అధికారం కోసం ఎంఐఎంకు భయపడి అధికారికంగా విమోచన దినోత్సవాన్ని జరపడం లేదని ఆయన విమర్శించారు.

పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే విమోచన దినోత్సవానికి పెద్ద ఎత్తున తరలిరావాలి..
భారతదేశానికి ఆగస్టు 15, 1947న స్వాతంత్ర్యం వచ్చినా నిజాం గుప్పిట్లో ఉన్న తెలంగాణ సెప్టెంబర్ 19, 1948 వరకు వేచి ఉండాల్సి వచ్చిందన్నారు. రజాకార్ల పాలనలో స్వేచ్ఛ, సమానత్వం పూర్తిగా నాశనం అయ్యిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే తెలంగాణ విమోచన దినోత్సవంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎడెల్లి అజయ్ కుమార్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై.అమృత, పార్టీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, కన్నె రమేష్ యాదవ్, శామ్‌రాజ్, పందిల్ల ప్రసాద్, ఎక్కాల కన్నా, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.